క్లుప్తంగా

కనులపండువగా కల్యాణోత్సవం



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగే శ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం స్వామివారి శాంతి కల్యాణోత్సవం కనులపం డువగా నిర్వహించారు. మాసశివరాత్రి సంద ర్భంగా స్వామివారికి ఉదయం రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం జరిపారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో పల్లకీలో ఊరేగించారు. శివసాథంలో స్వామివారికి శాంతికల్యాణోత్స వాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకొని పూజలు చేశారు. శ్రీరామలింగే శ్వర ట్రస్టు ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధి దాత సంగా నరసిం హారావు, ఈవో భవాని, ఆలయ ప్రధాన అర్చ కుడు జీఆర్‌వీ సాగర్ పర్యవేక్షించారు.

వక్ఫ్ బోర్డు భూములు పరిరక్షించాలని వినతి



పెనమలూరు: ఉమ్మడి కృష్ణా జిల్లాలో అత్యంత విలువైన వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షించాలని రాష్ట్ర నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ చిన్నా కోరారు. ఈ మేరకు పెనమలూరు తహసీల్దార్ గోపాలకృష్ణకు ఆయన బుధవారం వినతిపత్రం అందజేసి వివరాలు తెలిపారు. జిల్లాలో వక్ఫ్ బోర్డు భూములు 2,600 ఎక రాలు ఉన్నాయన్నారు. ఈ భూములు సగం ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. వక్ఫ్ భూములను వక్ఫ్ బోర్డు, రెవెన్యూ అధికరాలు కాపాడాలని కోరారు. తాడిగడప వక్ఫ్ భూముల సమస్యను సామరస్యంగా పరిష్క రించాలని కోరారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



ఉయ్యూరు: గుండె పోటుకు గురైనప్పుడు అప్ర మత్తతతో సీపీఆర్ చేస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని హోప్ ఆస్పత్రి క్రిటికల్ కేర్ వైద్యురాలు డాక్టర్ జ్యోతి అన్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పాఠశాలల్లో బుధవారం సీపీఆ ర్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఉయ్యూరు పట్టణంలోని శ్రీ శ్రీనివాస విద్యా సంస్థల్లో హోప్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యులు జ్యోతి, మీనాకుమారి సీపీఆర్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గుండె సంబంధిత సమస్యలు తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ పరుచూరి నీలిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: గోసాలలో యువకుడు అదృశ్య మైన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటర మణ తెలిపిన వివరాల ప్రకారం గోసాలకు చెం దిన చిట్టూరి నాగేంద్రబాబు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారు లతో కలిసి క్యాటరింగ్ పనులు చేస్తాడు. నాగేం ద్రబాబు పెద్ద కుమారుడు చిట్టూరి పవన్ ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో నాగేంద్రబాబు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అచ్యుతానందన్ జీవితం స్ఫూర్తినీయం

ఉంగుటూరు(గన్నవరం): మండల కేంద్రమైన ఉంగుటూరులోని మానికొండ సూర్యావతి శ్రామిక భవనంలో బుధవారం సీపీఎం మం డల కమిటీ ఆధ్వర్యంలో కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పూలమా లలు వేసి నివాళులర్పించారు. అనంతరం నర సింహారావు మాట్లాడుతూ.. అచ్యుతానందన్ అలుపెరగని రాజకీయ యోధుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. ఎనిమిది దశా బ్దాల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకు డిగా ఆయన కొనసాగారని తెలిపారు. పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన అచ్యుతానందన్ మరణం సీపీఎంకు తీరని లోటన్నారు. ఆయన స్ఫూర్తితో పార్టీని ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత కొత్త తరంపై ఉందన్నారు. పోరాట నాయకుడిగా, సీఎంగా, ప్రతిపక్ష నేతగా ఆయన పనిచేసినప్పటికీ ఎప్పుడు నిరాడంబర జీవితాన్ని మాత్రమే గడిపారని గుర్తుచేశారు. నాయకులు టీవీ లక్ష్మణస్వామి, అజ్మీరా వెం కటేశ్వరరావు, మాగంటి సాంబశివరావు, పిల్లి రాజారావు, మహమ్మద్ గాలిబ్ పాల్గొన్నారు.

రైతు నెత్తిన విత్తన భారం

- అధికమవుతున్న పెట్టుబడి వ్యయం
- గతేడాది దిగుబడులు వచ్చినా.. ధర లేక నష్టాలు
- ఈ సారి ఆశాజనకంగా సాగు చేపడుతున్న రైతులు

పసుపు విత్తన ధరకు రెక్కలు



రొయ్యూరులో మొక్క దశలో ఉన్న పసుపు పంట

కంకిపాడు: పెరుగుతున్న విత్తనం ధరలు సాగుపై భారం మోపుతున్నాయని పసుపు రైతులు ఆం దోళన చెందుతున్నారు. సాగు ఆరంభంలో విత్తనం రేట్లు పెరుగుతుండటంతో పెట్టుబడి వ్యయం కూడా పెరుగుతోందని వాపోతున్నారు. గతేడాది దిగుబడులు గణనీయంగా వచ్చినా ఆశించిన ధర పలకక స్వల్పంగా నష్టాన్ని చవిచూశారు. ఈ సారైనా మంచి ధర వస్తుందనే ఆశతో పచ్చ బం గారం (పసుపు) సాగు చేపడుతున్నారు.

ఇది జిల్లాలో పరిస్థితి..

ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా వాణిజ్య పంటల్లో ప్రధాన పంటల్లో పసుపు కూడా ఒకటి. కృష్ణాజి ల్లాలో 5031 ఎకరాల్లోనూ, ఎన్టీఆర్ జిల్లాలో 707 ఎకరాల్లోనూ పసుపు సాగుకు అనువైన భూములు ఉన్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పసుపు సాగులో రైతులు నిమగ్నమయ్యారు. తొలకరి పలక రింపు నాటి నుంచి జూలై ఆఖరు వరకూ రైతులు పసుపు సాగు పనులను నిర్వహిస్తారు.

విత్తన భారంతో పెట్టుబడి అధికం..

ఈ ఏడాది ముందుగానే తొలకరి పలకరించటంతో పాటుగా అడపాదడపా కురిసిన వర్షాలకు మెట్ట ప్రాంత రైతులు పసుపు విత్తనం సేకరించి సాగు చేపట్టారు. రూ. 40 వేలు నుంచి రూ. 50 వేల వరకూ కౌలు ఒప్పందాలు చేసుకున్నారు. ప్రధానం గా కడప, మైదుకూరు, ప్రగతి, శీలం, ఎర్రశీలం, స్థానిక విత్తన రకాలను సాగుకు ఎంపిక చేసుకు న్నారు. అయితే విత్తనం రేటు బహిరంగ మార్కెట్‌లో మోతమోగుతోంది. సాధారణంగా సీజన్ ఆరంభంలో పుట్టు (225 కిలోలు) రూ. 3500-రూ. 4500 వరకూ పలుకుతుంది. అయితే ఈ ఏడాది మాత్రం ఆ రేటు డబుల్ అయ్యింది. ప్రస్తుతం పుట్టు రూ. 6500-రూ. 7200 వరకూ పలుకుతోంది. ఎకరాకు ఐదు పుట్లు వరకూ విత్తనం అవసరం అవుతోంది. దీన్ని బట్టి విత్తనానికి రూ. 40 వేలు వరకూ పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

అప్పుడు నష్టం.. ఇప్పుడు కష్టం..

మార్చి, ఏప్రిల్‌లో రైతులకు పంట చేతికొస్తుంది. ఆ తరుణంలో పచ్చి కొమ్ములు పుట్టు రూ.3 వేలు మించి రేటు వచ్చిన దాఖలాలు లేవు.

ఈ ఏడాది కూడా అదే పరిస్థితి. తాము అమ్మబోతే రూ.3 వేలు మించి ధర పలకటం లేదని, కొనే క్రమంలో మాత్రం విత్తనం రేటుకు రెక్కలు వస్తున్నాయంటూ అన్నదాతలు వాపోతు న్నారు.

దళారుల వల్లే దుస్థితి..

మార్చిలో పచ్చి పసుపు కొమ్ములు రూ. 3 వేలు నుంచి రూ.3,500కే అమ్మాం. అంతకు మించి ధర రాలేదు. కానీ జూన్‌లో విత్తనం కొమ్ములు కొంటే రూ.6,800 అన్నారు. అదేమంటే విత్తనం దొరక టం లేదంటూ సాకులు చెబుతు న్నారు. మార్కెట్‌ను కొందరు దళా రులు నియంత్రించటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతోంది.

– బి.శివనాగిరెడ్డి, రైతు, చలివేంద్రపాలెం

ఖర్చులు పెరుగుతున్నాయ్..

గతంలో కౌలు రూ.30 వేలు ఉండేది. ఇప్పుడు రూ.45 వేలు దాటింది. విత్తనం రేటు రూ.6,500. చేలో పంట వేసే నాటికి పెట్టుబడి భారీగా పెరిగిపోయిం ది. అయినా సాగు చేపట్టక తప్పదు. పనులు చేస్తున్నాం. ఎండు కొమ్ములు రేటు రూ.10 వేలు దాటడం లేదు. రేటు పెరిగితే అమ్ముదామని చూస్తున్నాం.

– లుక్కా రాంబాబు, రైతు, రొయ్యూరు

ఎండు పసుపు గట్టెక్కదే?

గత సీజన్‌లో ఎండు కొమ్ములు క్వింటా రూ. 14 వేలు వరకూ ధర పలికింది. పంట పూర్తిగా అమ్ముడుబోయే నాటికి ఆ రేటు రూ. 11,500 – రూ.12 వేలు వద్ద నిలిచింది. ఈ ఏడాది ఆ రేటు దక్కనే లేదు. అంతేకాకుండా రూ. 10 వేలు మార్కు దాటక రైతులు పంటను అమ్ముకోవాలో?, నిల్వ చేసుకోవాలో? అర్థం కాని దుస్థితి. చాలా మంది రైతులు వద్ద ఇంకా పసుపు కొమ్ములు నిల్వలు ఉన్నాయి. రేటు వస్తుందని ఆశించి భద్రప ర్చుకున్నారు. మరో వైపు విత్తనం రేటు పెరిగినప్పటికీ చేసేది లేక సాగుకు అవసరమైన విత్తనం కొనుగోలు చేసుకుని సాగుకు ఉపక్రమిస్తున్నారు.



నాటేందుకు సిద్ధంగా ఉన్న విత్తనం కొమ్ము

టీడీపీ నాయకుల అరాచకాలు బట్టబయలు చేస్తాం



ఉయ్యూరురూరల్: దేవరమ్మ తల్లి సాక్షిగా టీడీపీ నాయకుల అరాచకాలు బట్టబయలు చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సవాల్ విసి రారు. మండలంలోని చిన్న ఓగిరాలలో వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా కార్యదర్శి పాలడుగు శివ జ్యోతి నివాసంలో బుధవారం ఆమె నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయ కుల విమర్శలను పూర్తిగా ఖండించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తిపై అవాకులు, చివాకులు పేలిన టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. అవినీతి, అక్రమాలకు అడ్డాగా టీడీపీ నేతలు పనిచే స్తున్నారని వారి బాగోతాన్ని బట్టబయలు చేసేం దుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. టీడీపీ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే అమ్మవారి ఎదుట ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. నాడు ఏ రాజకీయ భవిష్యత్ లేక కోపరేటివ్ బ్యాంకు ప్రెసిడెంట్ నియా మకం కోసం మా దగ్గర చేతులు చాచిన కుటుంబ రావు ఎన్నో అరాచకాలకు పునాదులు వేశారన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామినేని రమాదేవి, కంకిపాడు మండల కమిటీ అధ్యక్షురాలు మాదు శ్రీహరి రాణి, రైతు విభాగ నాయకులు దోనేపూడి సాంబశివరావులు మాట్లాడారు. సమావేశంలో ఉదయభాను, రాజేశ్వ రి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకిలో విద్యుత్ సరఫరాకు గురు వారం అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు చెప్పారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ పోరంకి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 7 నుం చి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌సరఫరాను నిలిపివేస్తామన్నారు. దీని కారణంగా పోరంకి సెం టర్, ప్రభునగర్, శ్రీనగర్‌కాలనీ, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగు తుందన్నారు.

తడి, పొడి చెత్త సేకరణ సమర్థంగా జరగాలి



పునాదిపాడులో అవగాహన కల్పిస్తున్న డీపీఓ అరుణ, అధికారులు

కంకిపాడు: తడి, పొడి చెత్త సేకరణ సమర్థంగా జరగాలని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె.అ రుణ ఆదేశించారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో డీపీఓ బుధవారం విస్తృతంగా పర్యటిం చారు. శానిటేషన్ డ్రైవ్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరణ తీరును తనిఖీ చేశారు. ఆయా కుటుంబా లతో తడి, పొడి చెత్త ఆవశ్యకతపై వివరాలు అడి గారు. డాక్టర్ అరుణ మాట్లాడుతూ.. వర్షాకాలం కావటంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. పారి శుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. చెత్త సేకరణ సమర్థంగా జరగాలని, చెత్త సంపద కేంద్రాల వినియోగం మరింత పకడ్బందీగా సాగాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓ కిరణ్మయి, ఈఓ బాపూజీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే కుట్ర



ఉంగుటూరులో మాట్లాడుతున్న లక్ష్మణస్వామి

ఉంగుటూరు(గన్నవరం): రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వెనుక విద్యుత్ రంగాన్ని ప్రైవే టీకరణ చేసే కుట్ర దాగి ఉందని ప్రజావేదిక నాయకుడు టీవీ లక్ష్మణస్వామి తెలిపారు. మం డల కేంద్రమైన ఉంగుటూరులో బుధవారం ప్రజా వేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు వద్దు - ట్రూ అప్ చార్జీలు రద్దు కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. లక్ష్మణస్వామి మాట్లా డుతూ.. రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని ఆదానీకి అప్పగించాలనే ప్లాన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోంద న్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అయ్యే రూ.18 వేలను కూడా వినియోగదారుడి బిల్లుల నుంచి మినహాయించుకుంటారన్నారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగులకొట్టమని చెప్పిన మంత్రి లోకేష్ ఇప్పుడు నోరు ఎందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజలందరూ మరో భారీ ఉద్యమాన్ని చేపట్టాల్సిన ఆవశ్యకత ఉం దన్నారు. లేనిపక్షంలో విద్యుత్ బిల్లుల భారానికి గురికావాల్సి వస్తుందన్నారు. నాయకులు రామ రాజు, గాలిబ్, చంటి, సాంబశివరావు ఉన్నారు.

ఏటిపాయకు వరద నీరు



కంకిపాడు: వరద నీటితో కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఏటిపాయ వరద నీటితో నిండి పోయింది. నీటి ఉధృతి రోజు రోజుకీ పెరుగు తోంది. మండలంలోని మద్దూరు, కాసరనేని వారిపాలెం గుండా కృష్ణానది ఏటిపాయ ప్రవ హిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షా లకు అధికారులు ప్రకాశం బ్యారేజీ నుంచి వరద నీటిని విడుదల చేశారు. దీంతో ఏటి పాయ రెండు రోజులుగా నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది.

బుధవారం సాయంత్రం ఏటిపాయలోకి రాక పోకలకు వీలుగా నిర్మించిన రహదారి మీదుగా నీరు ప్రవహిస్తోంది. దీంతో ఏటిపాయలోని పుచ్చలలంక ప్రాంతంలోని పంట పొలాలకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరే వరదనీటి ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉండటంతో ఏటిపాయకు భారీగా వరద నీరు చేరుతుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. నీటి ప్రవాహం ఇదే విధంగా కొనసాగితే రైతులు పడవలపై రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

అధికారుల ఆదేశాలు బేఖాతరు

- ఇటీవల ఆక్రమణను ధ్వంసం చేసిన అధికారులు
- ధ్వంసం చేసిన ప్రాంతంలోనే తిరిగి నిర్మాణం
- చక్రం తిప్పిన టీడీపీ నాయకుడు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీలో అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ రూ.లక్షలు విలువజేసే ఇరిగేషన్ స్థలాన్ని ఇష్టారీతిలో ఆక్రమించి నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాంతంలో ఏలూరు కాలువ కట్టను ఆక్రమించి పిల్లర్లు వేయడంతో ఇటీవల సాక్షి దినప త్రికలో 'దర్గాగా ఇరిగేషన్ స్థలం ఆక్రమణ' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఇరిగేషన్ అధికారులు ఆక్రమణ చోటు చేసుకున్న ప్రాంతాన్ని పరిశీలించి కాలువ కట్టపై నిర్మించిన పిల్లర్లను ధ్వంసం చేశారు. ప్రభుత్వ స్థలం ఆక్ర మిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆక్రమణకు పాల్పడిన ఇదే ప్రాంతానికి చెందిన కేబుల్ పం డును హెచ్చరించారు. అధికారులు ఆక్రమణను అడ్డుకోవడంతో ఆక్రమణదారుడు కేబుల్ పండు ప్రసాదంపాడు ఎస్‌సీఆర్ సెంటర్‌కు చెందిన ఓ టీడీపీ నాయకుడిని ఆశ్రయించాడు. దీంతో రంగం లోకి దిగిన సదురు నాయకుడు తాను ఎమ్మెల్యే అనుచరుడునంటూ ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చాడు. మా మనిషి చేపట్టిన నిర్మాణాన్నే అడ్డుకుంటారా అంటూ హడావుడి చేసినట్లు సమా చారం. దీంతో ఇటీవల ఆక్రమణను ధ్వంసం చేసిన ప్రాంతంలోనే మళ్లీ ఆక్రమించి నిర్మాణం చేపట్టాడు. స్థానికులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు.



ఇటీవల ధ్వంసం చేసిన పిల్లర్లు



ధ్వంసం చేసిన ఇరిగేషన్ స్థలంలోనే ఆక్రమించి నిర్మాణం

ఇటీవల పిల్లర్లు ధ్వంసం చేశాం..

ఈ ఆక్రమణపై ఇటీవల ఫిర్యాదు అందడం తో కాలువలోకి వేసిన పిల్లర్లు ధ్వంసం చేసి ఆక్రమణదారుడిని హెచ్చరించాం. తాజాగా మరలా ఆక్రమణ చేపట్టి నిర్మాణం సాగిం చిన విషయం మా దృష్టికి రాలేదు. ఈ ఆక్ర మణను పరిశీలించి తగిన చర్యలు తీసుకుం టాం.

– కోలా శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ

పడకేసిన పారిశుద్ధ్యం



కంకిపాడు లాకురోడ్డు మార్జిన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు



పద్మావతి నగర్ రోడ్డులో..

- ఎక్కడి చెత్త అక్కడే
- పొంచి ఉన్న వ్యాధుల భయం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కంకిపాడు: కంకిపాడులో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చెత్తకుప్పలు అక్కడే పేరుకుపోయాయి. పేరుకున్న వ్యర్థాలు, చెత్త కుళ్లి తీవ్ర దుర్గంధం వెలు వడుతోంది. అసలే వర్షాలు పడుతుండటంతో వ్యాధులు విజృంభించే అవకాశం ఉండటంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ప్రజా రోగ్యం ప్రమాదంలో ఉన్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమ ర్శలు వినిపిస్తున్నాయి.

మండల కేంద్రమైన కంకిపాడు పట్టణంలో పారి శుద్ధ్య సమస్యకు కేరాఫ్ అయ్యింది. మూడు రోజు లుగా పట్టణంలోని ఏ వీధి చూసినా పేరుకుపో యిన చెత్త, వ్యర్థాల కుప్పలే కనిపిస్తున్నాయి. ప్రధా నంగా పాత ప్రభుత్వాస్పత్రి మార్గంలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి ఉంది. లాకురోడ్డులోని పద్మావతి నగర్, లాకురోడ్డు ప్రాంతంలోని రోడ్డు మార్జిన్‌లు సైతం వ్యర్థాల గుట్టలతో నిండిపో యాయి. చెత్త కుళ్లి పోయి తీవ్ర దుర్గంధం వెలువడు తుండటంతో ప్రజలు తీవ్ర అవస్థ పడుతున్నారు. దీనికి తోడు ప్రధాన డ్రెయిన్లలో మురుగు వ్యర్థా లతో నిండిపోయి ముందుకు కదలటం లేదు.



కంకిపాడు లాకురోడ్డులో దుస్థితి

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు..

కంకిపాడు పట్టణం చుట్టు పక్కల 40 గ్రామాలకు కూడలి. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ప్రతి చిన్న అవసరానికీ కంకిపాడు వస్తుంటారు. ఇక్కడ చూస్తే ఏ ప్రాంతంలో చూసినా పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలే. దీనికి తోడు వర్షాకాలం కావటంతో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షానికి వ్యర్థాలు, చెత్త కుళ్లిపోయి దుర్గంధం వెలువడుతోంది. ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వర్షాకా లంలో వ్యాధులు విజృంభించే అవకాశం అధికంగా ఉంటుంది. దీంతో పొంచి ఉన్న వ్యాధులు భయం తో ప్రజలు వణికిపోతున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు..

పారిశుద్ధ్యం అధ్వానంగా తయారవుతోంది. వ్యాధులు భయం పొంచి ఉన్నా అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. సాధారణ రోజులతో పోలిస్తే వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై అధిక శ్రద్ధ వహించాలి. కానీ ప్రస్తుతం అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండటంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడకముం దే అధికారులు నిర్లక్ష్య వైఖరి విడనాడి ప్రజారోగ్య చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): విపత్తులు సం భవించిన సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉం డాలని వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఉన్న సమా వేశపు హాల్లో విపత్తుల నిర్వహణపై వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్న కుమార్‌తో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన విపత్తు ఎన్ని విధాలుగా రావచ్చు, రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ఎదుర్కొన్న తర్వాత తీసుకునే చర్యలు వంటి అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో విపత్తు నిర్వహణ ఎలా జరుగుతుంది, ఆ పద్ధతులు ఏ విధంగా మనకు అమలు చేయొచ్చు వంటి విషయాలపై చర్చించారు. వీఎంసీ గత ఏడాది తీవ్రమైన విప త్తును ఎదుర్కొందని, విపత్తు ఎప్పుడొస్తుంది ఎలాంటి పరిస్థితుల వల్ల వస్తుంది అన్న అంశాలు మనం చెప్పలేమని చెప్పారు. కానీ విపత్తు ఎలా వచ్చినా వీఎంసీ పరిధిలో విపత్తు సమయంలో పునరావస కేంద్రాలు ఎక్కడున్నాయో, వాటి కోసం ఎవరిని సంప్రదించాలి వారికి సహాయానికి వచ్చే బృందాల నంబర్లు, అన్ని విషయాలు విపత్తు సంభ వించే ప్రాంతాలకు తెలియపరిచినట్లు వెల్లడిం చారు. తద్వారా ప్రజలు ఎటువంటి పరిస్థితుల్లో నైనా సరే వారిని వారు కాపాడుకునే చర్యలు కచ్చి తంగా తీసుకునే అవకాశం ఉంటుందని చంద్రశేఖర్ వివరించారు. సమీక్ష సమావేశంలో నగరపాలకసం స్థలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఈ నెల 20 జిల్లా స్థాయిలో నిర్వ హించిన యోగా పోటీల్లో శ్రీ దుర్గామల్లే శ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని పి.గీతిక సత్తా చాటింది. దీం తో ఆమెను బుధ వారం కళాశాల ప్రిన్సి పాల్ ఎస్.పద్మజ, అధ్యాపకులు, విద్యార్థినులు అభినం దించారు.